క్లుప్తంగా

సన్మానం



కాటారం: యూత్ కాంగ్రెస్ మంథని నియోజక వర్గ అధ్యక్షుడిగా చీమల సందీప్ ఇటీవల నియమితులయ్యాడు. దీంతో సందీప్‌ను ఆదివారం జాతీయ బీసీ సంఘం ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు ఆత్మకూరి స్వామియాదవ్, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుర్కి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గేయ రచయితకు..



చిట్యాల: మండలంలోని జడలపేట శివారు భీష్మనగర్ గ్రామానికి చెందిన గేయ రచయిత, చిత్రలేఖన ఆర్టిస్ట్, తెలంగాణ సామాజిక రచయితల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టకోక్కుల రవీందర్‌ను భవాని సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. డా.వైరాగ్యం ప్రభాకర్ రచించిన నూరవ పుస్తక ఆవిష్కరణ సభ పురస్కారాల ప్రదానోత్సవం సందర్భంగా ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా రచయిత రవీందర్ రాసిన కవితలు మూడు పుస్తకాలలో ముద్రితము అయినందున శాలువతో పాటు మెమోంటోతో సన్మానించినట్లు రవీందర్ తెలిపారు. అలాగే హాస్య బ్రహ్మ తురుమెళ్ల శంకర్ నారాయణ, హాస్యావదాని సాధనాల వెంకటస్వామి నాయుడు, స్వర్ణ నంది అవార్డు గ్రహీత మల్లిక్, చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నట్లు పేర్కొన్నారు.

వజ్రోత్సవాల నిర్వహణకు సమావేశం



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఏర్పాటు చేసి 60 ఏళ్లు అయిన నేపథ్యంలో పూర్వ విద్యార్థులంతా కలిసి వజ్రోత్సవాల వేడుకలను నిర్వహించేందుకు ఆదివారం పాఠశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు నూతి కృష్ణ, నూక ప్రభాకర్, గొరంటల సత్యం, మల్లారెడ్డి, ఇర్సవడ్ల వెంకన్న మాట్లాడుతూ.. అందరం ఒక చోటున కలుసుకోవడానికి ఈ వజ్రోత్సవాల కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. తేదీలను ఖరారు చేసేందుకు కొంత సమయం పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్, అశోక్, రాజశ్రీ, రాంబాబు, జగన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీ



ఏటూరునాగారం: సరిహద్దు గ్రామీణ అటవీ ప్రాంతాల్లో ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం సివిల్, సీఆర్పీఎఫ్ ప్రత్యేక బలగాలతో విస్తృత తనిఖీలు నిర్వహించారు. మావోయిస్టుల వారోత్సవాల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా గస్తీ చేపట్టారు. చెల్పాక అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌ను నిరసిస్తూ మావోయిస్టులు బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో మావోయిస్టులు ప్రతీకార చర్యలకు పాల్పడే అవకాశం ఉండడంతో ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ బలగాలు పెద్ద ఎత్తున మొహరించి తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాలు రొయ్యూర్ అటవీ గ్రామీణ ప్రాంతాలు, ముల్లకట్ట వంతెన జాతీయ ప్రధాన రహదారిపై వాహన తనిఖీలు చేపట్టారు. వచ్చిపోయే వాహనాలను నిలిపి అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు, సామగ్రిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సరిహద్దు పరిసర గ్రామాలు, గొత్తికోయ గుడాలపై ప్రత్యేక దృష్టి సారించి తనిఖీలను ముమ్మరం చేశారు. అలాగే మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్, ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు.

కాళేశ్వరంలో..



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం బస్టాండ్ వద్ద రోడ్డుపైన నాఖబందీని ఎస్సై చక్రపాణి ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. ఆదివారం రాత్రి తెలంగాణ నుంచి మహారాష్ట్రలకు వచ్చిపోయే వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. తనిఖీలు, సోదాలు చేపట్టారు. అనుమానితులను విచారించి వదిలేశారు. సరైన పత్రాలులేని 12 వాహనాలను పట్టుకొని పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆయన వెంట సివిల్ పోలీసులు ఉన్నారు.

కాల్వలు అస్తవ్యస్తం

- ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు
- షట్టర్లు లేక వృథాగా పోతున్న నీరు
- పూడిక, చెత్తాచెదారం తొలగించని అధికారులు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు



నర్సింహుల కాల్వలోని బొమ్మరేవు వద్ద షట్టర్లు లేకపోవడంతో వృథాగా పోతున్న నీరు

గోవిందరావుపేట: లక్నవరం చెరువు నీరు పొలాలకు అందించే కాల్వలు అస్తవ్యస్తంగా ఉన్నాయి. కాల్వల్లో పూడిక కూడడం, పిచ్చి మొక్కలు పెరగడంతో చెరువు నుంచి పంట పొలాలకు సాగు నీరు అందడం లేదు. లక్నవరం చెరువు ఆయకట్టు కింద నాలుగు ప్రధాన కాల్వలు ఉండగా అందులో శ్రీరాంపతి, నర్సింహుల కాలువ కింద అధికారులు 4150 ఎకరాలకు యాసంగి టైబందీ ఖరారు చేశారు. శ్రీరాంపతి కాలువ కింద 1100 ఎకరాలకు అనుమతి ఇవ్వగా, నర్సింహుల కాలువ కింద 3050 ఎకరాలకు టైబందీ ఖరారు చేశారు. కాగా, నర్సింహుల కాల్వ రైతులు రెండు ఛానల్‌గా విభజించి నీరు అందించనున్నారు. అధికారులు పేరుకు మాత్రం నర్సింహుల కాల్వల ద్వారా 3050 ఎకరాల పంటకు నీరు అందిస్తామని గొప్పగా చెప్పుకున్న చివరి ఆయకట్టు పొలాలు మాత్రం ప్రతి ఏటా 300 నుంచి 400 ఎకరాలు పంట ఎండిపోతుందని రైతులు వాపోతున్నారు. అలాగే నర్సింహుల కాల్వ చెరువు నుంచి చివరి వరకు 11 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. కాల్వ పాతున్న కొద్ది ఎత్తు పెరుగడంతో నీరు చివరి వరకు పారడం గగనంగా మారుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను సంబంధిత అధికారులకు ఎన్ని సార్లు మొర పెట్టుకున్న ఫలితం లేదని ఆయకట్టు రైతులు వాపోతున్నారు.

టైబందీ ప్రకారం పూర్తి సాగు కష్టమే..

ఇప్పటికే అధికారులు యాసంగి టైబందీ ఖరారు చేశారు. చెరువులో 28 ఫీట్ల నీరు ఉంది. కాల్వల మీద కొంత మంది రైతులు దొంగతనంగా మోటార్ల సాయంతో పంటలు పండిస్తుంటారు. శ్రీరాంపతి, నర్సింహుల కాలువల మీద దాదాపు 300 మోటార్లతో ఉన్నట్లు పలువురు వాపోతున్నారు. దీంతో చివరికి ఆయకట్ట రైతులకు నీరు అందక తీవ్రంగా నష్టపోతున్నారు.

ప్రారంభం కానున్న యాసంగి సాగు

రైతులు ఇప్పటికే యాసంగి పంట కోసం నార్లు పోసి మరో 20 రోజుల్లో నాట్లు వేయడానికి సిద్ధం అవుతున్నారు. కానీ ఇప్పటికి ఇంక కాల్వల్లో షీల్ట్ తీయించలేదు, బుంగలు పూడ్చలేదు. అలాగే మొత్తం చెత్తాచెదారంతో నిండి ఉండడం, కాల్వల్లో ఉన్న తూముల వద్ద షట్టర్లు లేక నీరు వృథాగా పోతుంది. దీంతో చివరి ఆయకట్ట రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు నీటిని విడుదల చేసిన చాలా వరకు నీరు వృథా అయ్యే అవకాశం ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా త్వరగతిన కాల్వల్లో పిచ్చి మొక్క తీసేసి, పూడికతీత పనులు మొదలు పెట్టాలని, కొత్తగా షట్టర్స్ బిగించాలని సంబంధిత అధికారులను రైతులు కోరుతున్నారు.

మరమ్మతు చేపట్టాలి

కాల్వ మొత్తం పిచ్చి చెట్లతో, ఇసుకు మేటలు వేసి, బుంగలు పడి ఉంది. టైబందీ ఖరారు చేసిన అధికారులు కాల్వలు మరమ్మతు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. నర్సింహుల కాల్వ కింద ఒక్క ఎకరం ఎండిపోయిన అధికారులే బాధ్యత వహించాలి. పంటలకు ఇప్పుడు నీటిని విడుదల చేసిన చాలా వరకు నీరు వృథా అవడం తప్పా రైతుకు మాత్రం ఉపయోగపడదు. ఇప్పటికైనా అధికారులు కాల్వల మరమ్మతు పనులు మొదలు పెట్టాలి.

– మేర్గు భిక్షపతి, ఆయకట్టు రైతు

పుస్తక పఠనం అలవర్చుకోవాలి

- విశ్రాంత ఎంజీఎం వైద్యుడు సుధాకర్



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న సుధాకర్

రేగొండ: యువత పుస్తక పఠనం అలవర్చుకోవాలని విశ్రాంత ఎంజీఎం వైద్యుడు అప్పల సుధాకర్ అన్నారు. ఆదివారం మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో సుధాకర్ సొంత ఖర్చులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జ్ఞానాన్ని మించిన ఆస్తి మరొకటి లేదని, విజ్ఞాన సంపాదన కోసం పుస్తకాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ఇటీవల ఐఐటీ పాట్నాలో సీటు సాధించిన అల్లం తేజస్విని, కరీంనగర్‌లో ఎంబీబీఎస్ విద్యనభ్యసిస్తున్న కొండమల్ల ప్రణయ్‌లను సన్మానించారు. అలాగే గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలకు క్రీడా సామగ్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిజయ్‌పాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నడిపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ ఐలి శ్రీధర్ గౌడ్, విశ్రాంత ఉద్యోగులు కటంగూరి నర్సింహారెడ్డి, సూర రాఘవులు, అప్పాల రవీందర్ గ్రామస్తులు బండి భద్రయ్య, శ్రీపతి సంతోష్, దూలం దామోదర్, వెంకట్రామ్‌నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లోని సమస్యలు పరిష్కరించాలి

- ఎంఎస్ఎఫ్ నాయకుడు అనిల్‌కుమార్



విద్యార్థులతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్‌లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ నాయకుడు (ఎంఎస్ఎఫ్)అంబాల అనిల్ కుమార్ అధికారులను కోరారు. ఆదివారం బీసీ హాస్టల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు తినే భోజనంలో పురుగులు వచ్చాయని, వాటర్ సమస్య ఉందని తమకు సమాచారం వచ్చిందన్నారు. దీంతో హాస్టల్‌కు చేరుకొని విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుని వార్డెన్ దృష్టికి తీసుకువెళ్లగా, వార్డెన్ స్పందించి జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రవీన్ కుమార్, అజయ్ పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెకు మద్దతు

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సతీశ్



మాట్లాడుతున్న క్యాతరాజు సతీశ్

భూపాలపల్లి రూరల్: విద్యాశాఖ సమగ్ర శిక్ష విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ ఉపాధ్యాయులు ఉద్యోగులు ఈనెల 10 నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెకు ఏఐటీయూసీ జిల్లా సమితి సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్యాతరాజు సతీష్ ప్రకటించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకురాలు కోరిమి సుగుణతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 18 సంవత్సరాలుగా విద్యా శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే క్రమబద్ధీకరిస్తానని హామీ ఇచ్చి సంవత్సర కాలమైన ఆ ఊసే ఎత్తడం లేదన్నారు.

కాంగ్రెస్ పేదల ప్రభుత్వం



కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

- ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పని చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం ఉదయం జయడీలక్స్ రోడ్డు, సీఎస్ఐ కాలనీలో మార్నింగ్ వాక్ చేపట్టి రోడ్లు, డ్రెయినేజీలను పరిశీలించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూరగాయాల మార్కెట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే తక్షణమే రోడ్డుపైన ఉన్న చేపల మార్కెట్‌ను లోపలికి తరలించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల కోసం శ్రమిస్తుందన్నారు. దశలవారీగా ప్రజల సమస్యలన్నింటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట మడికొండ సంపత్‌కుమార్, ఒంటేరు సారయ్య, పంచగిరి జయమ్మ ఉన్నారు.

'పుట్ట మధును ప్రజలు నమ్మరు'

మల్హర్: రాష్ట్ర ప్రభుత్వం, మంత్రి శ్రీధర్‌బాబుపై ప్రతిపక్ష నాయకుడు పుట్ట మధు బురద చల్లితే ప్రజలు నమ్మరని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బడితెల రాజయ్య, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు దండు రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుట్ట మధు ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేక ప్రజా ప్రభుత్వాన్ని, ప్రజా నాయకులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు విమర్శిస్తూ.. కరపత్రాలు పట్టుకోని ఊరురా తిరుగుతున్నాడని విమర్శించారు. మంథని నియోజకవర్గంలో వివిధ పనులకు సుమారు రూ.1000 కోట్ల నిధులను తీసుకొచ్చిన ఘనత శ్రీధర్ బాబుకే సాధ్యమైందని వెల్లడించారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



పరకాల: సుబ్రహ్మణ్య స్వామి షష్టి జాతర ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని కుంకుమేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం రాత్రి స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించగా బ్రహ్మశ్రీ కోమాళ్లపల్లి సంపత్‌కుమార్ శర్మ, ప్రధాన అర్చకుడు కోమాళ్లపల్లి నాగభూషణం శర్మ ఆధ్వర్యంలో కల్యాణం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేడుకల్లో ధర్మకర్తలు, ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

'ఆరు గ్యారంటీల పేరుతో మోసం'

శాయంపేట : ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. మండలంలోని వసంతాపూర్‌లో ఆదివారం ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు మంద భద్రయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ లను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేస్తుందని అన్నారు. 420 హామీలను ఇచ్చి గద్దెనెక్కిన సీఎం రేవంత్ రెడ్డి పథకాలను ఆచరణలో అరకొర అమలు చేసి ఇదే ప్రజాపాలన అంటూ ప్రచార ఆర్భాటం చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల ముందు హామీలన్ని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నేటి నుంచి ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులందరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించాలని తెలిపారు.

రోడ్డుపై పడిన చెట్టు తొలగింపు



మల్హర్: మండలంలోని కొయ్యూరు పీవీనగర్ సమీపంలోని ఆదివారం సాయంత్రం అడవి సోమన్‌పల్లి వంతెన సమీపంలో ఉన్న ఓ పెద్ద చెట్టు వంతెనపై పడింది. దీంతో అడవి సోమన్‌పల్లి వంతెన మీదుగా మంథని–కాటారం వెళ్లే వాహనాలు రాకపోకలు నిలిచి పోయాయి. సమాచారం అందుకున్న కాటారం సీఐ నాగరార్జునారావు, కొయ్యూరు ఎస్సై నరేష్ అక్కడికి చేరుకోని వంతెనపై పడి ఉన్న చెట్టును గ్రామస్తుల సహకారంతో తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న డీఈఓ రాజేందర్

కాటారం: జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన జిల్లా స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మండల కేంద్రంలోని విద్యానికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు రైతులు పండించిన పంటలను కాపాడుకోవడానికి ఉపయోగపడే క్రాప్ ప్రొటెక్ట్ రేయిన్ గేజ్ అలారమ్ తయారు చేసి ప్రదర్శించి జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలిచారు. ఆదర్శ హై స్కూల్‌కు చెందిన విద్యార్థులు మూడు విభాగాల్లో ద్వితియ స్థానంలో నిలిచారు. సైన్స్ విభాగంలో మహిళల భద్రత కోసం అంజుశ్రీ, అభినవి ప్రత్యేక పరికరాలు రూపొందించగా, అద్నాన్, గోవర్ధన్ తయారు చేసిన మల్టీపర్పస్ అగ్రికల్చర్ మిషన్, మ్యాథ్స్ విభాగంలో సిరిచందన, సాయిచరణ్యలు తేల్స్ సిద్ధాతంపై ఇచ్చిన ప్రదర్శనలు ద్వితీయ స్థానం పొందాయి. చింతకాని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు రూపొందించిన రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ కమ్యూనికేషన్ ప్రదర్శన తృతీయ స్థానంలో నిలిచింది. ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన విద్యార్థులను నిర్వాహకులు రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌కు ఎంపిక చేశారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు డీఈఓ రాజేందర్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. విద్యార్థులు ప్రతిభ చూపడంపై ఆదర్శ హై స్కూల్ చైర్మన్ జనగామ కరుణాకర్ రావు, కరస్పాండెంట్ జనగామ కార్తీక్‌రావు, విద్యానికేతన్ కరస్పాండెంట్ బుర్ర వెంకటేష్‌గౌడ్, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు గందు రాజబాబు, ఆజ్మీర రవీందర్ హర్షం వ్యక్తం చేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



రేగొండ: పరామర్శిస్తున్న నాయకులు

రేగొండ: మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మడికంటి మహేందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను రాష్ట్ర రైతు రుణ విమోచన మాజీ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వరరావు ఆదివారం పరామర్శించి, రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట లెంకల శ్రీనివాస్‌రెడ్డి, కేశిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, జూపాక భాస్కర్, వంచనగిరి వీరేశం, బింగి భిక్షపతి, గుర్రాల సుమన్‌రెడ్డి ఉన్నారు.

టేకుమట్లలో..

టేకుమట్ల: మండలంలోని సోమనపల్లి గ్రామానికి చెందిన మారేపెల్లి పోచమ్మ ఇటీవల అనారోగ్యంలో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని గ్రామస్తులు పరామర్శించి, రూ.15,000 ఆర్థిక సాయం అందజేశారు. యువకులు మల్లేష్, రాజుకుమార్, చంద్రమౌళి, దేవేందర్, నరేందర్, కిరణ్, అరుణ్, అశ్వద్ధామ, కార్తీక్, ప్రణయ్, ప్రదీప్, అజయ్, విజయ్, ధనుష్, మధు, రామ్‌చరణ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

రామప్పను సందర్శించిన విద్యార్థులు



రామప్పలో విద్యార్థులు

ఐనవోలు: తెలంగాణ విజ్ఞాన్ దర్శనంలో భాగంగా ఆదివారం మండలంలోని పున్నేలు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రామప్ప, లక్నవరంలను సందర్శించినట్లు హెచ్ఎం రాయరాకుల పరమేశ్వర్ తెలిపారు. పునాది లేకుండా ఇసుకపై రామప్ప గుడి నిర్మించబడిందని, ఆలయ చరిత్రను చెబుతూ యునెస్కో గుర్తింపు పొందిన ఆలయమని విద్యార్థులకు హెచ్ఎం వివరించారు. అదేవిధంగా లక్నవరం సరస్సు గురించి వివరించారు. విద్యార్థులు ఎంతో ఆనందాన్ని వ్యక్తపరిచినట్లు తెలిపారు. సందర్శనకు వెళ్లిన వారిలో ఏపీసీ అధ్యక్షురాలు పొన్నం రమాదేవి, ఉపాధ్యాయులు అన్నారెడ్డి, ఇందిరా, రాహుల్‌కుమార్, వెంకటయ్య, స్వప్న ఉన్నారు.

రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

శాయంపేట : మండల ప్రజలకు 108 అంబులెన్స్ ఇస్తానని చెప్పి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నానని ప్రజాప్రభుత్వంలో పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని, రానున్న నాలుగేళ్లలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని ఆవరణలో ఆదివారం 108 అంబులెన్స్‌ను ప్రారంభించారు. అనంతరం ఒగ్గు డోళ్లతో, బోనాల మధ్య కార్యకర్తలతో భారీ ర్యాలీగా మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాకు చేరుకొని కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవ సంబురాల్లో పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో తాను ఎమ్మెల్యేగా గెలిచి సంవత్సరం గడిచిందని నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. శాయంపేట మండలానికి మొదటి నుంచి అంబులెన్స్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఎన్నికల ముందు ప్రజలకు 108 అంబులెన్స్ ఇస్తానని చెప్పి అంబులెన్స్ అందజేసి ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు రోజుకు 18 గంటలు కష్టపడి పని చేసి అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రూ. 2 లక్షల పైన రుణం ఉన్నవారికి త్వరలో మాఫీ చేస్తామని తెలిపారు. ఇల్లులేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేస్తామని ఇందిరమ్మ ఇళ్ల కోసం పైరవీలు చేసే వారిని నమ్మొద్దని సూచించారు. వారం రోజుల్లో రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన నిరుపేదలందరికీ ఇళ్ల నిర్మాణం కోసం ముగ్గు పోసి శంకుస్థాపన చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న రోజుల్లో భూపాలపల్లి నియోజకవర్గాన్ని, శాయంపేట మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ అప్పయ్య, ఆర్డీఓ నారాయణ, 108 ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఫణిచంద్ర, మండల వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మండల నాయకులు, వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'హామీల అమలులో విఫలం'

- బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి



బైక్ ర్యాలీలో పాల్గొన్న సునీల్‌రెడ్డి, నాయకులు

కాటారం: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో విఫలమైందని బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్‌రెడ్డి అన్నారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని ఆరోపిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో మహదేవపూర్ నుంచి మంథని వరకు చేపట్టిన బైక్ ర్యాలీ ఆదివారం కాటారం మీదుగా కొనసాగింది. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆచరణ సాధ్యం కానీ హామీలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిందన్నారు. ఏడాది పాలనలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసింది శూన్యం అని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి, బొమ్మన భాస్కర్‌రెడ్డి, దుర్గం తిరుపతి, పూసాల రాజేంద్రప్రసాద్, కేతిరి రాజు, తోడె వీరారెడ్డి, డోలి అర్జయ్య, మంత్రి సునీల్, వేణునాయక్, బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.